క్లుప్తంగా

నేడు డిప్యూటీ సీఎం పర్యటన

శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో శనివారం ఉదయం 10 గంటలకు వైఎస్సార్ చేయూత 4వ విడత కార్యక్రమంలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి పాల్గొంటారని ఎంపీడీఓ మోహన్‌మురళి తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొనాలని ఆయన కోరారు.

వాలీబాల్ టోర్నీ విజేత చవటగుంట



వాలీబాల్ పోటీలో తలపడిన జట్లు

వెదురుకుప్పం: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని సామాజిక కార్యకర్త జాకబ్ అన్నారు. మండలంలోని అయ్యన్నగారిపల్లెలో నెహ్రూ యువజన కేంద్రం, అమ్మ యూత్ అసోసియేషన్ సంయుక్తంగా వాలీబాల్ పోటీలు నిర్వహించాయి. ఈ పోటీల్లో తలపడిన 12 జట్లలో చవటగుంట జట్టు విన్నర్స్‌గా, అయ్యన్నగారిపల్లె జట్టు రన్నర్స్‌గా నిలిచాయి. ఆ జట్లకు నిర్వాహకులు బహుమతులు ప్రదానం చేశారు. ముఖ్యఅతిథిగా జాకబ్ మాట్లాడారు. కార్యక్రమంలో ప్రతినిధులు విజయ్, వెంకటేష్, నరేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నగరి: స్థానిక సీవీఆర్ కల్యాణ మండపంలో శనివారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, రాజలక్ష్మి ఆస్పత్రి వారు సంయుక్తంగా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే ఈ శిబిరంలో రక్తపోటు, సుగర్, స్త్రీ సంబంధిత చికిత్స, పిల్లల సంబంధిత చికిత్స, కంటి చికిత్స, చర్మసంబంధిత వ్యాధులు, ఎముకలు, ఈఎన్‌టీ సంబంధిత చికిత్స, సాధారణ వైద్యం అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మందులు ఉచితంగా అందిస్తామన్నారు.

వేడుకగా మణికంఠేశ్వర స్వామి గ్రామోత్సవం



పుర వీధుల్లో ఊరేగుతున్న స్వామివారు

కాణిపాకం: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీ మణికంఠేశ్వ స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. పార్వతీ పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఉభయదారులు, అధికారులు ఊరేగింపుగా తీసుకొచ్చి పల్లకిలో కొలువుదీర్చారు. అనంతరం పుర వీధుల్లో స్వామివారు ఊరేగుతుండగా భక్తులు స్వామివారికి కర్పూర హారతులు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పూజాధి కార్యక్రమాలకు పూతలపట్టు మండలం పేట ఆగ్రహారానికి చెందిన సుబ్రమణ్యం పిళ్లై ఉభయదారులుగా వ్యవహరించారు.

నేడు చిత్తూరులో శ్మశాన కొల్లు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరం సంతపేటలోని నీవానది ఒడ్డున శనివారం శ్మశాన కొల్లు(మయానసేవ)ను నిర్వహించనున్నట్లు శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయ నిర్వాహకులు కేఎం కుమార్, అర్చకులు కుమార్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు అమ్మవారు విశేష పూజలకు అందుకుని నీవానది ఒడ్డున ఏర్పాటు చేసిన కొల్లకు బయలుదేరుతారన్నారు. అనంతరం అక్కడ దక్షసంహార ప్రక్రియను పూర్తి చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పిస్తామన్నారు. తర్వాత నగరవీధుల్లో ఊరేగుతారని వారు పేర్కొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

పిచ్చాటూరు: మండలంలోని రామగిరిలో గ్రామ దేవత శ్రీ అంకాళపరమేశ్వరి ఆలయ కుంభాభిషేకం శుక్రవారం భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం శ్రీఅంకాళపరమేశ్వరి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి ఊయలపై కొలువుదీర్చి ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి సేవలో తరించారు. తీర్థ ప్రసాదాలు అందించారు.

సురుటుపల్లెలో నందిసేవ

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్రీపళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం మహాశివరాత్రి ఉత్సవాలును అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కనిపించింది. శివనామ స్మరణతో ఆలయం మార్మోగింది. ఉదయం ఆలయంలో ప్రత్యేక అభిషేక పూజలు, అలంకరణలు జరిగాయి. ఆలయ చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి తాగునీటి వసతి, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆలయంలో పుష్ప, విద్యుద్దీపాలంకరణలు ఆకట్టుకున్నాయి. లోకా ఫౌండేషన్ ఉదయం నుంచి రాత్రి వరకు వివిధ రకాల ప్రసాదాలు పంపిణీ చేసింది. ఉదయం, రాత్రి అన్నదానం చేశారు. రాత్రి సర్వాలంకార భూషితులైన శ్రీస్వామి,అమ్మవార్లను నంది వాహనంపై కొలువుదీర్చి మహా హారతులు చేపట్టారు. మంగళవాయిద్యాల నడుమ తిరువీధుల్లో ఊరేగింపు నయనానందకరంగా సాగింది.









నగరి: ఏకపాదమూర్తిని దర్శించుకుంటున్న మంత్రి, వెదురుకుప్పం: కొండమల్లీశునికి పట్టు వస్త్రాలు తీసుకెళ్తున్న కృపాలక్ష్మి, గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర స్వామిని దర్శించుకుంటున్న భక్తులు, కార్వేటినగరం: హోమం నిర్వహిస్తున్న వేదపండితులు

త్రిదళం.. ఏకబిల్వం శివార్పణం

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- భక్తి శ్రద్ధలతో మహాశివరాత్రి వేడుకలు

నగరి: నియోజకవర్గంలోని ఆలయాల్లో మహాశివ రాత్రి ఉత్సవాలు శుక్రవారం వైభవంగా జరిగాయి. కీళపట్టు త్రిపురసుందరి సమేత చంద్రమౌళీశ్వర ఆలయంలో ఉదయం నుంచి భక్తులు బారులు తీరారు. ఆలయం వద్ద భక్తులకు భారీఎత్తున ప్రసాదాలు పంపిణీ చేశారు. గుండ్రాజుకుప్పం హనుమతేశ్వర క్షేత్రంలో ఉదయం నుంచే భక్తులు సందడి కనిపించింది. బిళ్వార్చన, మహాభిషేకం, శివభజన కార్యక్రమాల్లో భక్తులు పాల్గొన్నారు. హనుమతేశ్వర స్వామిని, 60 అడుగుల ఎత్తున అభయ ఆంజనేయ స్వామిని, సరస్వతి దేవిని దర్శించుకున్నారు. ఆలయ ఆవరణలో ఉదయం నుంచి రాత్రి వరకు అన్నదానం చేశారు. బుగ్గ కాశీవిశ్వేశ్వర ఆలయానికి ఉదయం నుంచే భక్తులు క్యూ కట్టారు. నగరి కరకంఠేశ్వర స్వామి ఆలయంలో శతరుద్ర మహాయాగం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేక పూజలు నిర్వహించగా భక్తులు పాల్గొని ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేశారు. లింగోద్భవ పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వాహకులు భక్తులకు ప్రసాదాలు పంచిపెట్టారు. ముడిపల్లి నామతీర్థం కొండపైకి అధిక సంఖ్యలో చేరిన భక్తులు నాగలింగేశ్వర స్వామిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు భారీ ఎత్తున అన్నదానం చేశారు.

ఏకపాదమూర్తి సేవలో మంత్రి రోజా

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మున్సిపల్ పరిధి కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయంలో వినూత్నంగా తొమ్మిది అడుగుల ఎత్తులో నిర్మించిన ఏకపాదమూర్తిని, అఘోరాల మధ్య తపస్సు చేసే మహాశివుని శుక్రవారం మంత్రి రోజా దర్శించుకున్నారు. చిదంబరేశ్వరస్వామికి భక్తిశ్రద్ధలతో అర్చనలు చేశారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. శివుని ముందు తపస్సు చేసిన అఘోరాలకు శివుడు, బ్రహ్మ, విష్ణువు ఒక్కటే అని చాటిచెప్పే విధంగా శివుడు ఏకపాదంలో మూడు రూపాలు ధరించి సాక్షాత్కరించే అవతారమే ఏకపాదమూర్తి అని ఆలయ నిర్వాహకులు సుబ్రమణ్యం మంత్రికి వివరించారు. శివుని ఆకారానికి రుద్రాక్షలు, మహావిష్ణువు ఆకారానికి తులసి పూజలు, బ్రహ్మ ఆకారానికి తామర గింజలు వాడినట్లు తెలిపారు. నెల రోజుల పాటు నిష్ఠతో పనిచేసి ఈ రూపం తీసుకొచ్చినట్లు వివరించారు. స్వాములను దర్శించుకున్న అనంతరం మంత్రికి ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు అందజేశారు. ఆదిశక్తి యేదేంద్రస్వామి దేవియమ్మ మంత్రికి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు చంద్రారెడ్డి, యాకోబు, ఇంద్రారెడ్డి, బాలన్, మురుగ, ఆనంద్ కుమార్, కృష్ణమూర్తి ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాయి లింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం

మండలంలోని తడుకుపేట గ్రామం సత్యసాయి ఆలయంలోని సాయిలింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీ సత్య సాయి భజన మండలిలో ఓంకారం, నగర సంకీర్తన, గోపూజ, సాయి లింగేశ్వర స్వామికి రుద్రాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. బాల వికాస్ విద్యార్థులు తల్లిదండ్రులకు పాదపూజ చేశారు. శ్రీ సత్య సాయి సేవా ఆర్గనైజేషన్ చిత్తూరు జిల్లా అధ్యక్షులు మధుసూదన్ మట్లాడుతూ శ్రీ సత్య సాయిబాబా 100వ జయంతిని పురస్కరించుకుని లక్ష గృహ దివ్య నామ మహాయజ్ఞం గత ఏడాది నవంబర్ నుంచి కొనసాగుతోందన్నారు. మధ్యాహ్నం 650 మందికి అన్న ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా సేవాదళ్ సమన్వయ కర్త గజేంద్ర రెడ్డి, జాయింట్ కన్వీనర్ లవకుమార్, బాల వికాస్ గురువు శ్రీదేవి, మోనికా, రజనీ, సుమిత్ర, దినేష్, మనోజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



నగరి: అఘోరీశ్వరుని దర్శించుకుంటున్న మంత్రి రోజా

పలు ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు

పుత్తూరు: మండల పరిధిలోని వేణుగోపాలపురం నాగిలేరు సదాశివేశ్వర స్వామి దేవస్థానంలో శుక్రవారం మహాశివరాత్రిని పురస్కరించుకొని పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం తొరూరు గ్రామంలోని కామాక్షీ సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం పుత్తూరు పట్టణంలోని శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వడమాలపేట మండలం గూళూరు చెరువు కట్టపై వెలసిన కావేరి శివలింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. అన్ని చోట్ల మంత్రి రోజాకు నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, ఆలయ మర్యాదలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు, సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంతా శివమయం

మహాశివరాత్రి పురస్కరించుకొని పుత్తూరు పట్టణంతో పాటు పరిసర గ్రామాలు శివనామస్మరణతో మార్మోగిపోయాయి. కై లాసకోన, సదాశివకోన, మూలకోన, సింగిరికోనలకు వెళ్లే భక్తులతో పుత్తూరు పట్టణం జనసంద్రమైంది. పుత్తూరులోని అన్ని ఆలయాల్లో వేకువ జామునే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, స్వామి అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాలను వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. మధ్యాహ్నం ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

నంది విగ్రహ ప్రతిష్ఠాపన

నిండ్ర: మండల కేంద్రంలో వున్న శివాలయంలో ఉదయం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నంది విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. సాయంత్రం ఆలయంలో దీపారాధన నిర్వహించారు. అత్తూరు గ్రామంలో, చవరంబాకం గ్రామస్తులు శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు

వెదురుకుప్పం: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని ఆలయాలు శివనామస్మరణతో మార్మోగాయి. హరహర మహాదేవ.. శంభో శంకర అంటూ భక్తులు ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. శుక్రవారం మండలంలో డీఆర్ఎన్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై కొలువైన జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వరస్వామి, చవటగుంటలో కొలువైన ఆవుదేవర నందీశ్వర స్వామి, బలిజ మొండివెంగనపల్లె సమీపంలోని స్వయంభు సిద్దేశ్వరస్వామి, ముతాలం వద్ద ఉన్న సిద్దేశ్వర స్వామి, తిరుమలయ్యపల్లె శివాలయాల్లో శివ రాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు పవిత్ర స్నానమాచరించి శివపార్వతులను దర్శించుకున్నారు. ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు భక్తిపారవశ్యాన్ని నింపాయి. భక్తులకు అన్నదానం చేశారు. వివిధ రకాల పుష్పాలు, విద్యుద్దీపాల అలంకరణతో ఆలయాలు కొత్తశోభను సంతరించుకున్నాయి. ముతాలంలో భక్త జన సందడి నడుమ శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు.

గంగాధరనెల్లూరు వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి అరుణగిరిపై కొండమల్లీశ్వరస్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి స్వామి వారికి పూజలు చేశారు. ఆలయ ఆవరణలోని పంచ ముఖ ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సుకుమార్, కార్వేటినగరం ఎంపీపీ లత, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, మాజీ ఎంపీపీ అరుణ, నాయకులు బండి గోవర్ధన్ రెడ్డి, బండి హేమసుందర్‌రెడ్డి, ఎంపీటీసీలు మునిచంద్ర, గుణశేఖర్, కో-ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రోశిరెడ్డి, మాజీ సర్పంచులు బాలకృష్ణారెడ్డి, శ్యామల, గోవిందన్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాధరెడ్డి, డైరెక్టర్ మునికృష్ణారెడ్డి, నాయకులు బొజ్జారెడ్డి, రమణారెడ్డి, సుబ్రమణ్యం, జగదీష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: మండలంలో సింహరాజుపురంలోని పార్వతీ పరమేశ్వరునికి ప్రత్యేకంగా అలంకరించి పూజలు, అభిషేకాలు, ఆలయ ఆవరణలో హరికథ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి అమ్మవార్లను అలంకరించి ఊరేగించారు. శ్రీకావేరిరాజుపురం పాలకొండపై శివలింగానికి, నొచ్చిలిలోని వెలసిన గిరిరాజ కన్యకా పరమేశ్వరి అభిషేక, పూజలు, మధ్యాహ్నం రుద్రాభిషేకం చేశారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

గంగాధర నెల్లూరు: మండలంలోని ఎస్ఎస్. కొండ సిద్దేశ్వరస్వామి ఆలయంలో లింగోద్భవం, కొట్రకోనలో మల్లేశ్వరస్వామి దేవాలయం, గంగాధర నెల్లూరులో గంగాధరేశ్వర స్వామి ఆలయం, మహాదేవ మంగళంలోని ఉమామహేశ్వర ఆలయం, వెజ్జుపల్లెలో ఆవుదేవర నందీశ్వరస్వామి దేవాలయం, వేల్కూర్‌లోని శివాలయంలో ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. శివ జాగరణ చేసే భక్తుల కోసం రాత్రి హరికథ కాలక్షేపం కోలాటాలు, చెక్కభజనలతో అలరించారు.

శ్రీరంగరాజపురం: స్థానిక పల్లేరుకోనలోని శ్రీఆత్మలింగేశ్వరస్వామి ఆలయంలో ఆత్మలింగేశ్వర స్వామికి పాలాభిషేకం చేశారు. ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నదానం చేశారు. ధర్మకర్త మోహన్ నాయుడు,స్థానిక సర్పంచ్ హరిత, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి కుప్పయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కార్వేటినగరం: సుద్దగుంట సమీపంలోని శిష్టా సౌందర్యవల్లి సమేత శ్రీ సదాశివేశ్వరస్వామి ఆలయం, స్కంధ పుష్కరిణి సమీపంలోని ఉమా తంగమేశ్వర ఆలయం, చాకలివానిగుంట వద్ద కాశీవిశ్వేశరస్వామి ఆలయం, డైట్ ఆవరణలోని ఉమా మహేశ్వర ఆలయం, కొట్టార్వేడులోని అగస్త్యేశ్వరాలయం, పాదిరికుప్పం సమీపంలో అమ్మగారి చెరువు కట్టపై ఉన్న ఈశ్వరాలయంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ప్రతి ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు.

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలం కొటార్లపల్లెలోని కాశీవిశ్వనాథస్వామి ఆలయం, రామాపురం, కావూరివారిపల్లె, పులిగుండు వద్ద ఉన్న పులిగుండేశ్వరస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, చండీహోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అలాగే కోలాటాలు, చెక్క భజనల నడుమ స్వామివారిని ఊరేగించారు. భక్తులు మొక్కులు చెల్లించారు.



పాలసముద్రం: సింహరాజుపురంలో..



గంగాధరనెల్లూరు: కొట్రకోన మల్లేశ్వరస్వామి



కార్వేటినగరం: నందిపై విహరిస్తున్న స్వామి వారు



నిండ్ర: ప్రతిష్ఠించిన నంది, శివలింగం









కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయం వద్ద ప్రసాదాల పంపిణీ, పుత్తూరు: నాగిలేరు సదాశివేశ్వరస్వామి ఆలయంలో మంత్రి రోజా పూజలు, పాలసముద్రం: ఊరేగుతున్న పార్వతీపరమేశ్వరులు, పెనుమూరు: రామాపురంలో నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

జగనన్నను మరోసారి సీఎం చేద్దాం

- పేదల పక్షాన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఆలయాల అభివృద్ధికి పెద్దపీట
- ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

శ్రీరంగరాజపురం: అర్హతే ప్రామాణికంగా భావించి అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని డిప్యూటీ సీఎం నారాయణస్వామి కోరారు. శుక్రవారం మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమానిగంగమ్మ ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారానికి ఆయన హాజరయ్యారు. తొలుత డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి అమ్మవారికి పట్టు వస్త్రాలను ఊరేగింపుగా తీసుకువచ్చి సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకం అనంతరం ఆలయ నూతన పాలక మండలి సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. ఆయన మాట్లాడుతూ, చంద్రబాబు నాయుడు హిందూ ఆలయాలను ధ్వంసం చేస్తే జగనన్న ఆలయాలను పునర్నిర్మాణం చేస్తున్నారన్నారు. ఇందులో భాగంగానే నియోజకవర్గంలో కలికిరి, అలత్తూరు, పాలసముద్రం ఆలయాలను టీటీడీలో విలీనం చేశామన్నారు. అలాగే ఆరిమానిగంగమ్మ ఆలయాన్ని రూ.1.85కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఆలయాలు లేని గ్రామాలను గుర్తించి టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా 142 గ్రామాల్లో ఆలయాలను నిర్మిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి హిందూ ఆలయాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని, చంద్రబాబు తన పాలనలో ఒక్క ఆలయం నిర్మించిన దాఖలాలు లేవన్నారు. పేదల పక్షాన జగనన్న ఉంటే పెత్తందారులకు చంద్రబాబు, పవన్ ఉన్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్ సీపీని గెలిపించాలని కోరారు.

సేవకురాలిగా పని చేస్తా!

నియోజకవర్గ సమన్వయకర్తగా జగనన్న తనను ఆశీర్వదించారని, తానో సేవకురాలిగా పనిచేస్తానని, తన తండ్రిని ఆదరించినట్లే తననూ ప్రజలు ఆశీర్వదించాలని కృపాలక్ష్మి కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు రమణప్రసాద్‌రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ మణి, డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గురవారెడ్డి, ఆలయ చైర్మన్ లింగారెడ్డి, నాయకులు మాజీ సర్పంచ్ విజయబాబు, జనార్ధన్, దాము నాయుడు, కుప్పయ్య, మణి, కాలప్ప, డిశంబర్ శెట్టి, ఆదినారాయణరెడ్డి, ఆచార్యులు వెంకటచాలపతి అయ్యంగార్ పాల్గొన్నారు.



నూతన పాలక మండలి సభ్యులను సన్మానించిన డిప్యూటీ సీఎం నారాయణస్వామి, కృపాలక్ష్మి

మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలి

పుత్తూరు: మహిళలు తమ హక్కులను తెలుసుకోవాలని అంతర్జాతీయ నడక సంఘ కో-ఆర్డినేటర్ డాక్టర్ రవిరాజు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలోని మహిళా డాక్టర్లు, నర్సులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి అందించిన వైద్య సేవలను మరువలేమన్నారు. బాలికలు ఉన్నత చదువులు చదివి, అన్ని రంగాల్లో రాణించాలని సూచించారు. మహిళలను పూలమాలలు, శాలువాలతో సత్కరించి, కానుకలు అందజేశారు. కార్యక్రమంలో గవర్నర్ ఎలెక్ట్ మాధవనాయుడు, పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మహిళలు అన్నింటా రాణించాలి

గంగాధరనెల్లూరు: మహిళలు అన్నింటా రాణించాలని గంగాధరనెల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి దుర్గాదేవి అన్నారు. మండలంలోని అక్కన్నగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ప్రధానోపాధ్యాయులు ఆర్ గంగాధరం అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా దుర్గాదేవి మాట్లాడారు. మహిళా సాధికారత దిశగా మహిళలు పురోగమించాలని, దీనికి చదువు ఒక సాధనమన్నారు. పిల్లలు పట్టుదలతో చదివితే ఉన్నత స్థానాలకు చేరుకోగలరన్నారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు మహిళలను సన్మానించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్, ధర్మేంద్ర, ఫార్మా సిస్టర్ నాగలక్ష్మి, గంగాధర నెల్లూరు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్ రెడ్డమ్మ, సీఆర్పీలు కుమారి, భూలక్ష్మి, వలంటీర్ బేబీ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



మహిళాధికారులను సన్మానిస్తున్న ఉపాధ్యాయుడు గంగాధరం

స్నేహితుడి కుటుంబానికి చేయూత

- విరాళాలు సేకరించి పిల్లల పేరిట రూ.లక్ష డిపాజిట్

వెదురుకుప్పం: మరణించిన స్నేహితుడి కుటుంబానికి చేయూతనందించి, అండగా నిలిచారు. స్నేహం పేరుతో నమ్మించి మోసం చేసే వారిని చాలామందిని చూసి ఉంటాం కానీ, ఇలా మరణించిన స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకోవడం నిజంగా ప్రశంసనీయమే. మండలంలోని తార్లబైలుకు చెందిన కేశవులు రెడ్డి కుటుంబాన్ని అతని స్నేహితులు పరామర్శించారు. ఇటీవల కేశవులు రెడ్డి శ్రీరంగరాజపురం మండలంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం విదితమే. మృతుని స్నేహితులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. తమ వంతుగా విరాళాలు సేకరించి రూ.లక్షను పిల్లల పేరిట డిపాజిట్ చేశారు. తమ మిత్రుడి మరణం తమను కలచివేస్తోందని, ఆ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోలార్ ప్రకాష్, పెరుమాళ్లపల్లె ఎంపీటీసీ తోకల మురళీరెడ్డి, జాకబ్, చక్రధర సిద్ధాంతి, నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మృతి చెందిన కేశవులు రెడ్డి కుటుంబ సభ్యులతో స్నేహితులు